# మనసు

"చూస్తారేంరా, తన్నండి. కన్ను మిన్ను గానకుండా బలిసి అడ్డమయిన తిరుగుళ్లు తిరుగుతుంటే, మూతిమీద మీసం పెట్టుకుని ఎలా ఊరుకుంటార్రా" - ఓ గొంతు.

"ఎయ్యరెసెయ్యి, ఒళ్లంతా చితుక కొడితేగాని రోగం కుదరదు"- మరోగొంతు.

"అట్లా కొడితే సిగ్గోస్తదట్రా దానికి. సిగ, ముక్కు రెండు కోస్తే బతికున్నాళ్లు కుమిలి చస్తుంది" - ఇంకో ముసలి గొంతు.

"అయినా పురుగు పుట్రా తిని పుట్టలుండమంటే ఊరు సుద్దులన్నీ నా పాలే అన్నట్లు, ఆడు కూకోబెట్టి మేపుతుంటే తిన్నదరగక, మస్తెక్కి ఊరెక్కట్టుంటుంది మరి." - ఎడంచేతిని నడుంకానించి, కుడిచేతిని అటూ ఇటూ తిప్పుతు అంది ఓ నడి వయస్కురాలు.

"అయినా ఈ కాలమే యిట్లొస్తుందర్రా. మరి ఉండడానికో పోవడానికో కాని, గింత గింతోళ్లకు ఎంతోయిడి. అయినా పాపం పెరిగిపోతోంది. అందుకే ఆనల్లేవు పంటల్లేవు." మరో ముసలమ్మ.

పల్లెలోని ముత్యాలమ్మ గుడిముందరి వేపచెట్టు క్రింద గుమికూడిన రక రకాల వ్యక్తులు రక రకాలుగా అంటున్నారు. గోళ్లు గిల్లుకుంటూ సిగ్గు, అభిమానం ఆవిరై పోగా, పాలిపోయిన ముఖంలో భయం కనిపిస్తూంటే తల వంచుకొని నిల్చుంది లచ్చిమి.

"వాడేడిరా - ...... వాణ్ణి వదలిపెట్టారేం, వాణ్ణి గుంజుకరండి. మొదట వానొళ్లు మెదగాలి."

"అవునసే, పక్కలిరగ తంతేగాని తిక్కతిరగదు." అంతలో రెక్కలు వెనక్కు కట్టి వుంచబడ్డ నర్సిగాణ్ని ఇద్దరు నెట్టుకొచ్చి గుంపు మధ్యన నిలబెట్టారు. ముఖాన రక్తంచుక్క లేదు. తప్పుచేసిన తనం ప్రతి కదలికలో కనిపిస్తోంది.

తలవంచుకుని నిలబడ్డ నర్సిగాని ఎదురుగాపోయిన ఓ నడి వయస్కుడు తుపుక్కున ఊసి, "దున్నపోతులా బలిస్తే - ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో ఎలా తెస్తుందిరా. ఒంగబెట్టి బండలెత్తితే గాని నీ మస్తనగదు."

"కాదు కాదు. సువ్వగాల్చి ఇద్దరికి ఒళ్లెలుపునా వాతలు గుంజితే గాని - వాళ్లు చేసిన పనికి అదే తగిన చిగిచ్చ."

"ఓరి ముదనష్టపు ముండాకొడుకా, నీకేం పోయే కాలమొచ్చిందిరా పండంటి సంసారాన్ని పాడు చేసినావు. నీకు అక్కా, చెల్లెళ్ల లేరటరా" అంది ఓ అవ్వ ముక్కుమీద కుడిచేతి చూపుడు వ్రేలు ఆనిస్తూ.

ఒకడు నర్శిగాడిని చెంపమీద కొట్టాడు.
మరొకడు తుపుకుకున ఊసాడు.
ఇంకొకడు పళ్లు కొరికాడు.
వేరొకడు కళ్లెర్రజేసి చూశాడు.

ఒక్కొక్క మనిషి ఒక్కొక మాటంటుంటే, కొరడాతో కొట్టినట్టుంది. నర్శిగాడికి, వలలో చిక్కిన పావురంలా లచ్చిమి, బోనులో పడ్డ పులిలా నర్శిగాడు ఇద్దరూ తలవంచుకుని నిలుచున్నారు. పెద్ద మనుషులు వారిని ఏమేమో అడుగుతూ, తీర్పు చెప్పాలా లేక పంచాయతీ బోర్డుకో పెట్టాలా అన్న ఆలోచనలో బడి యింకా ఓ నిర్ణయానికి రాలేక పోతున్నారు.

"అయ్యో, మనం చూడంగా దాన్ని ఏం చిన్నచూపు చూశాడని, తిండికి సంపిండా, బట్టకు సంపిండా అసలెందుకీ పని చేసినట్టు."

"ఆడింకెవతినన్న మరిగిండేమో."

"ఛీ ఛీ అట్లాంటివాడు కాడే వాడు. ఆనికా చితిలాకి బుద్ధులు లేనే లేవు."

"మరెందుకిదీ పని చేసినట్లు ?"

"అయినా చేసేవాండ్లందరూ ఎందుకీ పని చేస్తుంర్రన్న సంగతి తెలిస్తే ఈ రంకు రంగే వెలిసేది."

ఇంతలో గుంపులో గుసగుసలు బయలుదేరాయి. బస్సు దిగిన మల్లయ్య చేతిలో ఆ రోజు దిన పత్రికను పట్టుకొని గుంపు వైపు వస్తున్నాడు. చెట్టుక్రింద కూడిన మందిని చూడగానే మల్లయ్య మనస్సులో ఆలోచనలు ముసిరినవి.

"ఏమయ్యుంటుందబ్బా! ఇంత జనం ఎందుకు కూడారు. ఏదో కొట్లాట జరిగుంటుంది."

భుజంమీద సిల్కు కండువా అంచును పండ్ల మధ్యన కరచిపట్టి తదేకంగా గుంపువైపు చూస్తూ వస్తున్నాడు.

మల్లయ్యది ఎత్తైన విగ్రహం. బలిష్టమైన శరీరం. కష్టం చేసుకొని సంపాదించి, సుఖం పొందాలంటాడు. మంచీ, చెడు తెలిసిన మనిషి కాబట్టే అప్పుడప్పుడు పెద్దమనుష్యులకు సైతం బుద్ధి చెబుతుంటాడు.

"మల్లయ్య కెరుకలేనట్లుంది." - ఒకావిడ.

"అవును పాపం ఏంచేస్తాడోఏమో" - మరొకావిడ.

"కొంపతీసి కొట్టి చంపుతాడేమొ, వీళ్లనీ తప్పదీస్తే" ఇంకొకావిడ.

మల్లయ్య గుంపును సమీపిస్తున్నాడు. గుంపు మల్లయ్యవైపు చూస్తున్నారు. మల్లయ్యను చూచిన లచ్చిమి ప్రాణం - దీపానికంటుకున్న

పుసగులా కొట్టుకుంటోంది. ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని, నీళ్లనిండిన కళ్లతో అతనిని చూడలేక నేలను చూస్తోంది. శరీరమంతా చెమటతో నిండినా నోటిలో మాత్రం తడిలేసి నర్సిగాడు మల్లయ్యను, అతని రాకను చూసే స్థితిలో లేడు.

గుంపును సమీపించిన మల్లయ్యకు ఎవరూ ఏమీ చెప్పలేదు. ఎవరినీ ఏమీ అడుగలేదతను. వెనక్కి చేతులు కట్టి వుంచిన నర్సిగాణ్ని, కొంతదూరంలో తలవంచుకొని నిలబడ్డ లచ్చిమిని చూడగానే మల్లయ్యకు ఎవరో తన గుండెలో బాకుతో పొడిచినట్లయింది. ఏదో సుడిగాలి అతనిని చుట్టినట్లయింది. ఎంతో వేగంతో పోయే వరదలో కొట్టుక పోతున్నట్ల యింది. మల్లయ్యకు కళ్ళముందు గతం కదలాడింది.

... కొత్తచీర కట్టుకున్న లచ్చిమి కాళ్లకు మొక్కుతోంది.

... తిరనాళ్లలో గాజులు, మెట్టెలు పెట్టుకున్న లచ్చిమి తనవైపు చూస్తూ యివి చల్లగుంటే చాలంటోంది.

... దేవునికి దీపారాధన చేయిస్తే మన కడుపున ఓ కాయకాయక పోతుందా అంటోంది -

... అర్ధరాత్రికాడ బావికాడికి పోతుంటే పురుగు, బూసి జాగ్రత్త అంటోంది -

... నేను నీకు, నాకు నీవు తప్ప లోకాన మనకింకేముం దంటోంది -

అబ్బ! ఆ లచ్చిమియేనా యీ లచ్చిమీ ? ఎంతపని చేసింది ? రక రకాల ఆలోచనల్ని అదుపులో పెట్టుకొని, పొంగివచ్చే దుఃఖాన్ని

కథా నిలయం
3444
శ్రీకాకుళం



అంచి పట్టుకున్నాడు మల్లయ్య. ఎంతో మందివున్నా ఎవరూ లేనట్లుగా నిశ్శబ్దం ఆవరించిందా చోటను. భుజంమీది సిలుకు కండువా ఎడమ చేతిలో నలిగిపోతూంది. దినపత్రిక జారి క్రిందపడింది. మల్లయ్య మందిని చీల్చుకొని కొద్ది దూరంలో ఉన్న తన యింటివైపు నడిచాడు. అందరూ అతనివైపే చూస్తున్నారు. కొంతసేపటి తర్వాత లచ్చిమికి సంబంధించిన చీరలు, రెవికలన్నింటినీ మోపులా చేతపట్టుకొచ్చి రాతి బొమ్మలా నిలబడ్డ లచ్చిమిపైకి విసరి, ఎవరి ముఖం చూడకుండా తల వంచుకుని రోడ్డువైపు నడిచాడు.

అంతవరకూ చూస్తూ ఊరుకున్న జనం ......

"ఇది ఊరా పాడా."

"నేనెంత మొనగాడో ననుకున్నా - చంపుతాడో, నరుకుతాడో ననుకున్నా"-

"అయినా వాడికే శరంలేనిది మనకేంబట్టిందిరా."

"ఏరో ఎట్లనో మాట్లాడుతవూ - పసులకు పసులే కాస్తాయ్రటా."

"వాడు బుద్ధి చెప్పకపోయినా మనమన్నా ఏదో చిగిచ్చ చేయాలి. ఇట్లానే వదలిపెడితే, యియ్యాల యిది, రేపు యింకోటి - ఆ తర్వాత ఊరంతా పాడేకదా !"

"ఛీ రండాకొడుకు; పెళ్లాం రంకుచేస్తే ఎంసక్కా ఏమనకుండా వదలిపెట్టాడు."

-అంతవరకూ అన్నీ ఓపిగ్గా వింటూ వేపచెట్టు మొదలుకు ఆనుకు కూర్చున్న గోపన్న దారంతో కట్టుకున్న కళ్లద్దాలను సవరించుకుంటూ కర్ర సహాయంతో లేచి గుంపు మధ్యకొచ్చి -

"ఎవర్రా చిగిత్స చేసేది, మల్లిగాడు రండనా, మీరంతా మొనగాళ్ళా-మీకంటే వాడే నయం - ఎవరికి తెలియదురా మీ సంగతి ?" అంటూ కుడిచేత్తో కర్రపట్టుకుని, ఎడమచేత్తో రొమ్ముకు చరుస్తుంటే అతుకుబడ్డ ర్ఫేంలో నుండి తెల్లని సీసపు గోళీల్లాంటి కనుగ్రుడ్లు ఉద్రేకాన్ని చిమ్ముతున్నాయి. ముడతలుబడ్డ మొఖం - మడతలలో ఎనబయి సంవత్సరాలు కనపడుతున్నవి.

ఒకనివైపు మళ్ళి "నీవు రాసిని దోచలే."

మరొకనివైపు మళ్లి "నీవు పెళ్లిగాని పిల్లను పల్లెకు లేపుకరాలే"

మరొకనివైపు మళ్లి "కొంౘెడు భూమికోసం నీవు నీ తోడబుట్టిన అన్ననే చంపలే."

ఇలాంటివన్నీ చిగిత్స కావలసిన తప్పులు కావా ? అయినా మీరు తప్పుకు తిరుగుతూ -ఊళ్లొ తప్పులను ఎంచుతున్నా రెందుకురా? ఇంతకీ మల్లయ్యే ఏం తప్పు చేసిండని. ఏందో అది బలిసి ఆనెమ్మడిపోతే నీవెతుక్కున్న బాటన నీవే పొమ్మనడం తప్పా ? నిజంగా చెప్పాలంటే వాడేరా మనిషి మీరంతా పెద్ద మొనగాండ్లయి వాడు చేసిన పనిని ఎగతాళి చేస్తున్నారర్రా, సిగ్గు లేదురా మీకు. అయ్యా, నర్సయ్యా - యిక పోనాయనా, యీమెను నీవే ఉంచుకుని సంసారం చెయ్యి. ఏదో లేచిన ఘడియ మంచిదయింది. నీ అదృష్టం బాగుంది" అంటూ కర్ర సహాయంతో వెళ్లిపోయాడు గోపన్న.

ఎవరూ ఎదురు మాట్లాడలేక గొణుక్కుంటూ కదిలిపోయారు.